# ప్రతిఫలం

గడియారం కేసి చూసాడు. గుండె ఆగినంత పనయింది. పరీక్షకి సరిగ్గా ఒక్క గంటే వుంది. కోపం పట్టలేక స్కూటర్‌ని కాలితో ఒక్క తన్ను తన్నేడు.

స్నేహితుడు స్కూటర్ యిస్తానన్నాడు కదా అని నెమ్మదిగా తయారయ్యాడు, స్కూటర్ ఎక్కితే యిరవై నిమిషాల్లో కాలేజీకి చేరిపోతానన్న ధీమాతో. తీరా స్టార్టు చెయ్యబోయే సరికి నేను స్టార్టవనని మొరాయించుకుని కూర్చుంది స్కూటర్. ప్లగ్ డిఫెక్టేమో అని అది తీసి క్లీన్ చేసాడు. అయినా స్టార్టవ లేదు. టైము గడుస్తున్న కొద్దీ అతనికి కంగారు ఎక్కువవుతోంది. చమటలు పట్టసాగేయి. ఆ గాబరాతో హేండిల్ బార్ అటూ, ఇటూ తిప్పుతూ, వైర్లు, అన్నీ కదిపి చూస్తూ, స్కూటర్ పట్టుకుని పరిగెత్తి గేర్ వేస్తూ నానా తంటాలూ పడుతున్నాడు. ఆఖరికి ఏ దేవుడి దయవల్లో "బర్..." మంటూ స్టార్ట్ అయ్యింది. వెయ్యిదేముళ్ళకి మొక్కుకొంటూ, ఆపితే మళ్ళీ స్టార్ట్ అవదేమో! అనే భయంతో ముఖానికి పట్టిన చమటన్నా తుడుచుకోకుండానే మంచి స్పీడు మీద అడ్డ త్రోవని నడపడం ప్రారంభించాడు.

కాకినాడ ఇంజినీరింగ్ కాలేజీ దరిదాపులకి వచ్చాడు. మామిడితోటల మధ్యలోంచి స్కూటర్ వెళ్తోంది. టైముకి చేరుతానన్న ఆనందంతో "హమ్మయ్య" అనుకున్నాడు సుధాకర్. మరో ఫర్లాంగు ముందుకు వెళ్ళిన సుధాకర్‌కి తోటలో కీచుగా అరుస్తున్న ఆడగొంతుక వినిపించింది. మంచి వేసవికాలం కావడంతో ఎక్కడా జనసంచారం లేదు. అనాలోచితంగా ఆ కేకలు వినపడ్డ వైపుకి స్కూటర్ తిప్పాడు సుధాకర్. కొంత దూరం వెళ్ళిన అతనికి ఓ అమ్మాయిని ఇద్దరు దుండగులు ఓ చెట్టు క్రింద పడవేసి వంటినున్న గుడ్డలు ఊడపీకడానికి చేస్తున్న ప్రయత్నాన్ని ఆపాలని తంటాలుపడుతూ, ఏడుస్తూ అరుస్తున్న దృశ్యం కంటపడింది. అది చూసిన సుధాకర్ శరీరంలోని రక్తం ఒక్కసారిగా ఉడకసాగింది. అదే స్కూటర్ మీద వారి మధ్యకి వెళ్ళి, వాళ్ళ మీదకి తిరగపడ్డాడు. ఓ పది, పదిహేను నిమిషాలు పెనుగులాడిన మీదట వాళ్ళు పారిపోయారు.

ఏడుస్తూ లేచి నిలబడ్డ ఆ అమ్మాయిని ఊరడించి, స్కూటర్ వెనక ఎక్కించుకుని ఆమె చెప్పిన అడ్రస్‌కి తీసుకెళ్ళి దింపాడే కాని తాను పరీక్ష రాయవలసిన టైము దాటిపోయిందన్న సంగతి గుర్తురాలేదు సుధాకర్‌కి. గాభరాగా స్కూటర్ తీసుకుని కాలేజీకి వెళ్ళిన సుధాకర్‌ని లెక్చరర్ గుమ్మం దగ్గరే అడ్డగించి లోపలికి వెళ్ళనివ్వలేదు. సుధాకర్ జరిగిందంతా చెప్పి కాళ్ళా వేళ్ళా పడ్డాడు. అయినా ఏ మాత్రం చలించలేదు. అంతా విని "ప్రిన్సిపాల్‌తో వెళ్ళి చెప్పు ఆయన రాయమంటే లోపలికి పంపిస్తా" నన్నాడు. తిన్నగా ప్రిన్సిపాల్ రూమ్ వైపు నడిచాడు. ఆయన దగ్గర కూడా జరిగిందంతా చెప్పి పరీక్ష రాయడానికి అనుమతి ఇవ్వమని బతిమాలాడు.

"పరీక్షలకని తెలిసినప్పుడు సామర్లకోటనుంచి రావడమెందు"కని అడిగాడు ప్రిన్సిపాల్.

"మా నాన్నగారి ఉద్యోగం అక్కడే సార్! ఇక్కడ నన్ను పెట్టి చదివించే స్తోమత లేక రోజూ అక్కడినుంచే వచ్చి వెళ్తూ ఉంటాను సార్! పేదవాళ్ళం. ఇంటికి పెద్ద కొడుకుని. ఫైనలియరు. నేనీ పరీక్ష రాసి పాసయితే, మా కుటుంబానికి కాస్త ఆసరా అవుతారని మా వాళ్లంతా ఎంతో ఆశ పెట్టుకుని అప్పుచేసి మరీ చదివిస్తున్నారు సార్!" అంటూ బతిమాలసాగాడు.

"నీవు చెప్పినదంతా నిజమే అని ఋజువేమిటి? నిర్లక్ష్యంగా తిరిగి, ఇలాంటి కట్టుకథలల్లి చెప్పేవాళ్ళని చాలామందిని చూసాను. నీ పరీక్ష సంగతి అంత మర్చిపోయి ఊళ్ళోవాళ్ళకి ఉపకారానికి వెళ్ళడమెందుకు? ఇప్పుడు వాళ్ళనే వెళ్ళి సహాయమడుగు – వచ్చే ఏడాది పరీక్ష రాసేదాకా నీ కుటుంబాన్ని ఆదుకుంటారేమో! ఇప్పుడేడ్చి ప్రయోజనం ఏమిటి? ఆ బుద్ధి అప్పుడుండవలసింది! ఇప్పుడు నేనేంచెయ్యలేను. అయినా రూల్స్ ఒప్పుకోవు." అని కఠినంగా చెప్పగానే దిగులుగా నిరుత్సాహంగా బయటికొచ్చేసాడు.

సుధాకర్ తల తిరిగిపోతోంది. "ఏడాదంతా ఎంతో కష్టపడి చదివాను. అంత శ్రమ బూడిదలో పోసిన పన్నీరయిపోయింది. ఇన్నేళ్ళ చదువు గంగ పాలయిపోయింది. ఇక ఏ ముఖం పెట్టుకుని ఇంటికెళ్లను? " అనుకున్నాడు. పిచ్చివాడిలా ఊరంతా తిరిగాడు. ఇంటికి వెళ్ళాలనిపించడంలేదు. అంత ఎండలోనూ స్కూటర్ వేసుకుని సముద్రపుటొడ్డుకి బయలుదేరాడు. స్కూటర్ ఓ పక్కగా ఆపి ఇసుకలో కూర్చున్నాడు. అలా ఎంతసేపు కూర్చున్నాడో తెలీదు. ఆలోచనలు అతనిని ఏ అఘాయిత్యానికైనా

పొల్పుడేలా చేసేలాగున్నాయి. తల మొద్దుబారి పోయింది. తల నరాలన్నీ చిట్లిపోతున్నట్లున్నాయి.

ఉదయం తల్లి పెట్టిన టిఫిన్ కూడా పరీక్ష రాయాలన్న టెన్షన్‌తో తినలేదు. ఆ తరువాత మళ్ళీ ఇంతవరకు ఏమీ తినలేదు. ఎండవేడి, దానికి తోడు మానసిక వ్యధ, ఉదయం ఆ గూండాలచేత తిన్న దెబ్బలకి ఒళ్ళంతా నొప్పులు - అన్నీ ఒకటికి మరొకటి తోడై నీరసం వచ్చి స్పృహతప్పి పడిపోయాడక్కడే.

తెలివొచ్చేసరికి తనో ఇంట్లో ఉన్నట్లు తెలుసుకున్నాడు. చల్లటి ఫాన్ గాలికి కాస్త ఉపశమనంగా ఉంది. ఇంతలో గ్లాసులో పండ్ల రసం తీసుకుని వచ్చిందో అమ్మాయి. కళ్ళు తెరిచి తేరిపార ఆమెనే చూశాడు. గుండె శరవేగంతో కొట్టుకోసాగింది. కళ్ళు చిట్లించి మళ్ళీచూసాడు.

"ఆ అమ్మాయే! ఉదయం తను ఉపకారం చేసి అపకారాన్ని పొందిందీ అమ్మాయివల్లే!! హే భగవాన్ ! మళ్ళీ ఇక్కడికెందుకు తీసుకొచ్చావు?" అనుకుంటుండగా, అది గ్రహించినట్లు, "నేను, నా స్నేహితులతో సాయంత్రం బీచ్‌కి షికారు వెళ్ళి మీరు అక్కడ స్పృహతప్పి పడిపోయి ఉండటం చూసి, మా కారులో తీసుకొచ్చాము. డాక్టర్ వచ్చి మందులిచ్చి, బలానికి ఇంజక్షన్ చేసాడు. ఎలాగుందిప్పుడు?" అంటూ చేతికి పళ్ళ రసం గ్లాసు అందించింది.

ఏం జవాబు చెప్పాలో తెలీక నిట్టూర్చి "బాగానే ఉంది" అంటూ కళ్ళు మూసుకున్నాడు. ఉదయం జరిగిందంతా మళ్ళీ కలలో తిరగసాగింది. ఇంకా అక్కడ ఉండబుద్ధి వెయ్యక లేచి వెళ్ళిపోదామని ప్రయత్నించాడు. నీరసంతో లేవలేకపోయాడు. "ఈ అమ్మాయివల్లే నా భవిష్యత్తంతా నాశనమయ్యింది" అనుకుంటూ కసిగా పళ్ళు పిండుకున్నాడు.

"ఎవరొచ్చారమ్మా శీలు! బయట ఎవరిదా స్కూటర్?" అంటూ అడుగుతున్న ఆయనతో, "నాన్నా! నాన్నా!" అంటూ ఉదయం జరిగిందంతా చెప్పి, తన్ని సుధాకర్ ఎలా రక్షించి, ఇంటికి తీసుకొచ్చిందీ చెప్పాకా, మళ్ళీ సాయంత్రం అతను సముద్రపు ఒడ్డుని పడున్న కథనం, తను ఇంటికి తీసుకొచ్చి చేస్తున్న సపర్యల గురించి చెప్పసాగింది.

అన్నీ విని, "ఏడమ్మా మన పాలిట దేవుడిలా వచ్చి నీ మానాన్ని కాపాడి, నిన్ను మళ్ళీ నాకప్పగించిన ఆ దేవుడు? అతనే అడ్డుకోకపోతే పెళ్ళి కూడా కుదిరిఉన్న నీ నూరేళ్ళ జీవితం ఏమయిపోయేదీవేళ?! అతనేడి తల్లీ!" అంటూ ఆ అమ్మాయిని అక్కున చేర్చుకుని తిన్నగా సుధాకర్ గదిలోకే వచ్చి అతను పడుకున్న మంచం మీద

కూర్చున్న శీలు తండ్రి కరెంటు తీగ తగిలి షాక్ కొట్టిన వ్యక్తిలా పాలిపోయిన ముఖంతో అతన్నే చూస్తూ కూర్చుండిపోయాడు మాటలు రానివాడిలా.

సుధాకర్ పరిస్థితీ అలాగే ఉంది.

ఒకరినొకరు చూసుకోలేక తలలు దించుకున్నారు.

"హే భగవాన్! ఇతన్నేనా ఉదయం పరీక్ష రాయనివ్వకుండా, కట్టుకథలు చెప్పద్దని, దొంగనాటకాలాడద్దని కఠినంగా తిట్టి నానా మాటలాడి పంపిస్త! ఇతనే అడ్డుకోకపోతే నా కూతురి శీలం ఏమయ్యేది? నా కూతురి భవిష్యత్తు కాపాడిన వాడి భవిష్యత్‌ని నేను నాశనం చేసానా?? నా బిడ్డని కాపాడినందుకు నేనతనికిచ్చిన ప్రతిఫలం ఇదేనా?!" అనుకుంటూనే అతని రెండు చేతులూ పట్టుకున్నాడు క్షమించమన్నట్లు.

మరి క్షమించమనడంలో అర్థం??

అతని భవిష్యత్ చక్కదిద్దుతాననా??

సుధాకర్ మనసుమాత్రం ఒడ్డున పడ్డ చేప పిల్లలా కొట్టుకుంటోంది అతని చూపులకి అర్థం తెలీక.

ఆంధ్ర పత్రిక వారపత్రిక

**24 సెప్టెంబర్ 1987**